నవతెలంగాణ
1
ఆదిలాబాద్
మంగళవారం | అక్టోబర్ 03, 2023 | www.navatelangana.com

బెల్లంపల్లి పట్టణాభివృద్ధికి కృషి

తాండూర్: బెల్లంపల్లి పట్టణ అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. సోమవారం బెల్లంపల్లి పట్టణంలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బెల్లంపల్లిలో అంతర్గత రోడ్ల నిర్మాణం, డ్రైనేజ్ వ్యవస్థ మెరుగుపరిచేందుకు నిధులను వెచ్చిస్తున్నట్లు తెలిపారు. 2వ వార్డులో రూ.50లక్షలతో నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. 16, 18 వార్డుల్లో రూ.40లక్షల చొప్పున సీసీ డ్రైనేజ్ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. 17వ వార్డులో ఇండ్ల పట్టాల పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, కౌన్సిలర్లు గోపిక రమేష్, అశోక్‌గౌడ్, దామర శ్రీనివాస్, కొమ్ము సురేష్, నెల్లి రమేష్, దాసరి రమేష్, దామర కిరణ్, కంబాల రాజేష్ పాల్గొన్నారు.



నేటి నుండి గ్రీన్ బిజినెస్ ఎగ్జిబిషన్

- వివిధ రాష్ట్రాల నుండి రానున్న ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు పేపర్ మిల్స్, భారతీయ యువశక్తి ట్రస్ట్ సంయుక్తంగా మంగళ, శుక్రవారాలలో రెండు రోజుల పాటు గ్రీన్ బిజినెస్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నారు. స్థానిక వినయ్ గార్డెన్‌లో నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌కు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఒరిస్సా, తమిళనాడు, ఢిల్లీ తదితర రాష్ట్రాల నుండి ఓత్సాహిక పారిశ్రామిక వేత్తలు హాజరు కానున్నారు. భారతీయ యువశక్తి ట్రస్ట్ ఆధ్వర్యంలో పర్యావరణహిత వ్యాపారాల నిర్వహణకు ముందుకు వచ్చే యువతకు అవగాహన కల్పించడం, వారిని ఆర్థికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా తాము ఈ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు బీవైఎస్‌టి ప్రాజెక్టు హెడ్ ఎస్ చంద్రశేఖర్‌రావు, కాగజ్‌నగర్ యునిట్ హెడ్ కిరణ్ తెలిపారు.

సర్పంచ్ నిధుల దుర్వినియోగంపై జీపీకి తాళం

నవతెలంగాణ - చింతలమానేపల్లి

మండలంలోని గంగపూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గోమాసి విలాస్ పాలకవర్గానికి తెలియకుండా పంచాయతీ నిధులు డ్రా చేసి వాడుకున్నారని సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో సర్పంచ్‌ను గ్రామస్తులు నిలదీశారు. గ్రామ పంచాయతీ కార్యాలయానికి తాళం వేసి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ సర్పంచ్ పంచాయతీ నిధుల నుండి రూ.2.35లక్షలు పంచాయతీ తీర్మానం లేకుండా ఖాతాలో జమ చేసుకున్నాడని తెలిపారు. ఆ నిధుల గురించి గ్రామసభలో నిలదీయగా సమాధానం చెప్పకుండా గ్రామసభ నుండి వెళ్లిపోయారు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు గ్రామపంచాయతీ కార్యాలయానికి తాళం వేసి ధర్నా చేపట్టారు. నిధులు తన సొంతానికి వాడుకున్న సర్పంచ్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. సమ్మెలో ఉన్నప్పుడు సర్పంచ్ డబ్బులు కాజేశారని కార్యదర్శి తెలిపారు. తనకు ఎటువంటి సంబంధం లేదని పేర్కొన్నారు. ఆందోళనలో ఉప సర్పంచ్ బిబ్బెర కమల, వార్డు సభ్యులు, గ్రామస్తులు సుధాకర్, చందు, అంజన్న, తులసీరాం, తిరుపతి పలువురు యువకులు పాల్గొన్నారు.


పంచాయతీ ముందు నిరసన తెలుపుతున్న ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ యువకులు

ఉపాధ్యాయుల సమస్యలు మేనిఫెస్టోలో చేర్చాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్రంలో నెలకొన్న ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యల పరిష్కారం దిశగా కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో చేర్చాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఆదిలాబాద్ పట్టణానికి విచ్చేసిన కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్ బాబును సోమవారం కలిసి మెమొరాండం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వెంకట్, జిల్లా అధ్యక్షులు స్వామి, ప్రధాన కార్యదర్శి అశోక్, నాయకులు ఉన్నారు.

శ్రీధర్ బాబును కలిసిన సమగ్ర ఉద్యోగులు

తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో కమిటీ చైర్మన్ శ్రీధర్ బాబును సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రవీందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేస్తానన్న ముఖ్యమంత్రి హామీ ఏమైందని ప్రశ్నించారు. తమ సమస్యను పరిష్కరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని శ్రీధర్ బాబును కోరారు. మేనిఫెస్టోలో తమ సమస్యలను చేర్చాలని కోరారు.

రాజకీయాల్లో నేతకాని కులానికి ప్రాతినిధ్యం కల్పించాలి

నవతెలంగాణ-మంచిర్యాల

రాజకీయాలలో, నామినేటెడ్ పదవులలో ఎస్సీ కులానికి చెందిన నేతకాని వారికి ప్రాతినిధ్యం కల్పించాలని తెలంగాణ నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్ అన్నారు. సోమవారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గాల్లో మాల, మాదిగ తర్వాత అతిపెద్ద ఓటు బ్యాంకు ఉన్న నేతకాని కులానికి ఎలాంటి నామినేటెడ్ పదవులు దక్కడం లేదని, అన్ని వర్గాల రాజకీయ నాయకులు నేతకాని వారిని చిన్నచూపు చూడడం సరికాదని పేర్కొన్నారు. తెలంగాణలో 19ఎస్సీ నియోజకవర్గంలో తగిన ఎమ్మెల్యే సీట్లు కల్పించడం లేదని ఆరోపించారు. హైదరాబాద్‌లో నేతకాని సంఘానికి భవన్ కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏజెన్సీ ఏరియాలలో సాగు చేసుకునే ఎస్టీ వారికి మాత్రమే పట్టాలు ఇచ్చారని, వారితో సమానంగా ఎస్సీలు కూడా భూమిని సాగు చేసుకుంటున్నారని, వారి కి కూడా పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా కుల ధ్రువీకరణ పత్రాలలో నేతకానికి బదులు నెటకాని అని చూపిస్తోందని, దాన్ని సవరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామెర ప్రకాష్, నాయకులు దుర్గం నగేష్, రామటెంకి శంకర్, రాష్ట్ర యువత అధ్యక్షుడు దుర్గం సంతోష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యువరాజ్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ముందుకు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అన్ని వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే జోగు రామన్న స్పష్టం చేశారు. పట్టణంలోని తిర్పెల్లి కబరస్తాన్‌లో రూ.65లక్షల నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులను సోమవారం ప్రారంభించారు. ముస్లిం మత పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు జరిపిన అనంతరం అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ నాలుగు మైనార్టీ గురుకులాలను ఏర్పాటు చేసిందన్నారు. అలాగే ఇదివరకే రూ.17కోట్లతో మసీదులో మౌలిక వసతులకు కృషి చేసిందని తెలిపారు. శ్మశాన వాటికలో తగు సౌకర్యాల కల్పన కోసం అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అతి త్వరలోనే నిర్దేశిత పనులను పూర్తి చేసేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, కౌన్సిలర్ సాయిప్రణయ్, నాయకులు సాజిదొద్దీన్, యూనుస్ అక్బాని పాల్గొన్నారు.

ప్రగతి భవన్ వరకు పాదయాత్ర

ఆదిలాబాద్‌రూరల్ : కుమురం భీం కాలనీవాసుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కాలనీలో నివసిస్తున్న ఆదివాసులు తుడుం దెబ్బ ఆధ్వర్యంలో హైదరాబాద్ ప్రగతి భవన్ వరకు చేపట్టిన పాదయాత్రకు ఆమె సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కాలనీలో నివాసం ఉంటున్న ఆదివాసులకు పట్టాలు ఇవ్వకుండా స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఇబ్బందులకు గురిచేయడంతో బాధతో వారు ప్రగతి భవన్ వరకు పాదయాత్ర చేపట్టి ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తారని తెలిపారు. పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు అక్రమ లే అవుట్లను అధికారుల అండతో సక్రమంగా మార్చేసుకుంటున్నారని కానీ ఇల్లు లేని పేదలకు పట్టాలు ఇవ్వడానికి ప్రభుత్వం ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి కాలనీవాసుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు గోడం గణేష్, ఎంపిటిసి జంగు బాపు, పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

4న చలో సంక్షేమ భవన్ విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్ : గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించాలని డిమాండ్‌తో ఈ నెల 4న నిర్వహించ తలపెట్టిన చలో సంక్షేమ భవన్ విజయవంతం చేయాలని టిఎస్‌యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైద్య శాంతి కుమారి, సోయం ఇందురావు ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్‌తో పాటు గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు నిర్వహిస్తామని హామీ ఇచ్చిన అధికారులు షెడ్యూల్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సంక్షేమ భవన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల, గిరిజన ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు ఉద్యమకారుల ధర్నా

కాగజ్‌నగర్ : ఈ నెల 3న హైదరాబాద్‌లోని ధర్నా చౌక్‌లో చేపట్టే 1969 తెలంగాణ ఉద్యమకారుల ధర్నాను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మార్త సత్యనారాయణ ఒక ప్రకటనలో కోరారు. ఉద్యమకారులను తెలంగాణ సమరయోధులుగా గుర్తించి ఐడీ కార్డులు ఇవ్వాలని, గౌరవ ఫించన్లు ఇవ్వాలని, 70 ఏళ్ల పైబడిని వారికి ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని, వారి కుటుంబాలకు రూ. 25 లక్షల ఆర్థిక సహాయం అందించాలనే తదితర డిమాండ్‌లతో చేపట్టే ఈ ధర్నాలో ప్రతీ ఉద్యమకారుడు పాల్గొనాలని కోరారు.

వైద్యంపై బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి



నవతెలంగాణ-ఉట్నూర్

బీఆర్ఎస్ ప్రభుత్వం వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించి అందరికి మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తుందని జెడ్పీ చైర్మెన్ జనార్ధన్, ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ అన్నారు. వీరిరువురు సోమవారం ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రిలోని అన్ని గదులను తిరిగి వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రభుత్వ వైద్యం అందుతున్న తీరును స్వయంగా రోగులను అడిగి తెలుసుకున్నారు. రోగులకు పండ్లను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆస్పత్రి అభివృద్ధికి ఎలాంటి సహాయమైన చేస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం విద్య వైద్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ఇందులో భాగంగా ప్రతి జిల్లాకో మెడికల్ కళాశాల, గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వాసుపత్రికి వచ్చే పేదలకు మెరుగైన వైద్యం అందించడమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మెరుగైన వైద్యాన్ని అందించాలని వైద్యులను, సిబ్బందిని కోరారు. వారి వెంట సూపరింటెండెంట్ జాదవ్ ఉపేందర్, ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, వైస్ ఎంపీపీ బాలాజీ ఉన్నారు.

గ్రామ సభలో సమస్యలు ఏకరువు పెట్టిన ప్రజలు



ఆసిఫాబాద్ : ఆసిఫాబాద్ గ్రామపంచాయతీ ఆవరణలో డిపిఓ సురేందర్, డిఎల్పిఓ అహ్మద్ ఉమర్ హుస్సేన్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో ప్రజలు సమస్యలను ఏకరువు పెట్టారు. అధికారులతో పాటు జెడ్పిటిసి నాగేశ్వరరావు, ఎంపిపి మల్లికార్జున్, పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ సమాధానం ఇచ్చారు. ప్రజలు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో డెంగ్యూ కేసులు పెరిగాయని, నీటి నిల్వ ఉన్నచోట స్ప్రేయింగ్, ఆయిల్ బాల్స్ వేయాలని కోరారు. శ్మశాన వాటికకు సరిహద్దు ఏర్పాటు చేయాలన్నారు. జెడ్పిటిసి అరిగెల నాగేశ్వరరావు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారుల దృష్టి సారించాలని తెలిపారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీ కావడంతో పాటు రూ.25 కోట్ల నిధులు కూడా వచ్చాయని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి కొనసాగుతుందన్నారు. సందీప్‌నగర్ సామిల్ వెనకాల రహదారి నిర్మాణానికి స్థానికులతో సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. డిపిఓ సురేందర్ మాట్లాడుతూ ప్రజల సహకారంతో గ్రామపంచాయతీ అభివృద్ధి కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. డిఎల్పిఓ అహ్మద్ ఉమర్ హుస్సేన్ మాట్లాడుతూ గ్రామ సభకు వచ్చేటప్పుడు అధికారులు అన్ని రకాల సమాచారంతో రావాలని సూచించారు. సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, వైస్ ఎంపీపీ సుంకరమంగ పెంటయ్య, మాజీ ఎంపిటిసి సుగుణాకర్, లుంబిని దీక్ష భూమి అధ్యక్షుడు జాడిబాపు, నాయకులు హైమద్, నిసార్, సలాం, అహ్మద్ పాల్గొన్నారు.

దళితుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పోరాటం చేస్తాం

- కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్



నవతెలంగాణ - వాంకిడి

రాష్ట్రంలోని దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసే సంఘం కులవివక్ష వ్యతిరేక పోరాటం సంఘం అని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ అన్నారు. సోమవారం మండలంలోని కిర్డీ గ్రామంలో కేవీపీఎస్ 25వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత జాతి సంక్షేమం కోసం పాలకులు కృషి చేయాలన్నారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన 10 సంవత్సరాల కాలంలో దళితులకు అనేక వాగ్దానాలు చేసి విస్మరించారని, దళితుల కోసం ఇచ్చిన ప్రతి హామీ పేపర్లకే పరిమితమైందన్నారు. దళితుల ఓట్లను తన రాజకీయ ఎదుగుదలకు వాడుకొని దళితులను వంచించడం సిగ్గుచేటన్నారు. జిల్లాలో పేద ప్రజల సమస్యలు పట్టని ప్రభుత్వమని, అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామని చెప్పినా నేటి వరకు కూడా సమస్యలు అలాగే ఉన్నాయన్నారు. పేద ప్రజలు ఎక్కడ గుడిసెలు వేసుకుంటే అక్కడ దౌర్జన్యం చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులందరికి దళితబంధు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కిరణ్, లింగయ్య, పెంటు, విశాల్, జీవన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌తో సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించొచ్చు



తాండూర్: సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించడానికి బెస్ట్ కమ్యునికేషన్ స్కిల్స్ అవసరమని గ్లోబల్ స్పార్క్ టెక్ సొల్యూషన్ కో ఫౌండర్ ప్రముఖ సాఫ్ట్‌వేర్ నిపుణులు కొక్కుల ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలో జరిగిన లెక్చర్స్ ఆఫ్ లైఫ్ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ రంగంతోపాటు ఎంటర్ ప్రెన్యూర్షిప్ భవిష్యత్ అవకాశాలపై విద్యార్థులు అడిగిన పలు సందేహాలకు సమాధానం ఇచ్చారు. ప్రశ్న సమాధానం పద్ధతిలో ఈ లెక్చర్ విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేలా సాగింది. ప్రిన్సిపాల్ ఐనాల సైదులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా మహాత్మా గాంది చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం ప్రవీణ్‌కుమార్‌ను ప్రిన్సిపాల్ ఐనాల సైదులు జడ్పి వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ పూర్వ అధ్యక్షులు దాగం మహేష్, సభ్యులు అడ్డూరి వెంకటస్వామి, రాజు, గోగర్ల రమేష్, వైస్ ప్రిన్సిపాల్ కె.రాజ్‌కుమార్, వరమని ప్రమోద్‌కుమార్, అధ్యాపకులు యండి రఫి, ఆకెనేపల్లి రాజేష్, అల్లూరి వామన్, యండి కౌసర్ ,స్రవంతి, పొన్నం శ్రీనివాస్ పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ జిల్లా నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-కాగజ్‌నగర్

భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) కుంరంభీం ఆసిఫాబాద్ జిల్లా నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. స్థానిక కాపు భవనంలో ఆదివారం తృతయ మహాసభలు నిర్వహించిన విషయం తెల్సిందే. ఈ మహాసభలకు హాజరైన రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గెడం టీకానంద్, ఉపాధ్యక్షులుగా చాపిడి పురుషోత్తం, వడ్లూరి శ్రీకాంత్, శ్రావణి, కోశాధికారిగా దుర్గం రాజ్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా అత్మకూరి సతీష్, తల్లపెల్లి రాజేశ్వర్, దుర్గం నిఖిల్, మసాదె పవన్‌కుమార్, కమిటీ సభ్యులుగా చాపిడి శివ, కె కృష్ణకుమార్, జాడి శ్యాం, సవిత, కె లక్ష్మి, సాయిరాం, చాపిడి వంశీ, దుర్గం పవన్, చాపిడి కార్తీక్, ఆర్ వినోద్, బి శ్యాంరావు, ఎల్ బుద్దాజి ఎన్నికయ్యారు.

చేపలు పెంచి ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి



ఉట్నూర్ : గిరిజనులు చెరువుల్లో చేపలను పెంచి ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని నర్సాపూర్(బి) సర్పంచ్ కళావతి, పెసా కో ఆర్డినేటర్ అర్క వసంత్‌రావు, మత్స్యాశాఖ పరిశీలన అధికారి రాథోడ్ సురేశ్ అన్నారు. సోమవారం మండలంలోని నర్సాపూర్(బి) గ్రామ పంచాయతీ పరిధిలోని గండిగూడ గ్రామనికి చెందిన చెరువుతో పాటుగా గొట్టి, సాకెర, నర్సాపూర్, గట్టెపల్లి, దొడంద, సాలెవాడ(బి), సాలెగూడ, కోపర్గాడ్ చెరువులలో గిరిజన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో చేప పిల్లలు వదిలారు. ఈ సందర్భంగా సర్పంచ్, పెసా చట్టం జిల్లా కోర్డినేటర్ మాట్లాడుతూ గిరిజనులను వ్యవసాయ రంగంతో పాటుగా మత్స్యశాఖ రంగంలో కూడా అభివృద్ధి పర్చేందుకు ఐటీడీఏ ద్వారా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏజెన్సీ ప్రాంత చెరువులో చేపలను పెంచి, పోషించి గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, ప్రతి చెరువుకు ప్రభుత్వం ద్వారా చేపల సొసైటీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

యూరియా కోసం రైతుల రాస్తారోకో



నవతెలంగాణ-జన్నారం

యూరియా దొరకడం లేదని మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు సోమవారం పిఎసిఎస్ ఫర్టిలైజర్ దుకాణం ముందు ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. ప్రభుత్వం ద్వారా రైతులకు సబ్సిడీపై అందించే యూరియాను ప్రభుత్వం సక్రమంగా సరాఫరా చేయడం లేదని పేర్కొన్నారు. పిఎసిఎస్ అధికారులను ఎన్నిసార్లు అడిగినా రెండు మూడు రోజుల్లో వస్తుంది ఇస్తాం అంటూ తప్పించుకుంటున్నారన్నారు. యూరియా కావాలని ప్రైవేటు ఫర్టిలైజర్ దుకాణాలకు వెళితే వారు డిఎపి కొంటేనే యూరియా ఇస్తామని కండీషన్లు పెడుతున్నారని తెలిపారు. ధర్నా చేస్తున్న రైతులకు కాంగ్రెస్ నాయకులు మద్దతు పలికారు. రైతుల ధర్నాతో రోడ్డుకి ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రైతులకు నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు.

విష జ్వరాల నుండి ప్రజల ప్రాణాలు కాపాడాలని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం



నవతెలంగాణ-మందమర్రి

విష జ్వరాల నుండి ప్రజల ప్రాణాలు కాపాలని సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సంకె రవి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రోజురోజుకూ విష జ్వరాలు పెరుగుతున్నాయన్నారు. ప్రతి ఇంట్లో నలుగురైదుగురు జ్వరాల బారినపడి అల్లాడిపోతున్నారన్నారు. ప్రైవేట్ ఆసుపత్రిల్లో ఒక్కరికే టెస్టుల కోసం 8వేల నుంచి12వేల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. జిల్లా యంత్రాంగం స్పందించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తుంటే స్పందించం లేదని పేర్కొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు నోరు మెదపకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజల ఓట్లతో గద్దెనెక్కిన ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రజలు విష జ్వరాల బారినపడి విలపిస్తుంటే కనీసం పట్టించుకున్న పాపాన పోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా అధికారులు స్పందించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి దూలం శ్రీనివాస్, పెద్ద లచ్చన్న, గడ్డం శంకర్, నిర్మల, ఉమా, లావణ్య, సది, రమేష్, అప్పారావు పాల్గొన్నారు.

వేతనాల పెంపు పట్ల ఆర్పీల సంబరాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

చిరుద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా వారి సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కెసిఆర్ పాటు పడుతున్నారని, అందుకు అనుగుణంగా ఆర్పీల వేతనాలను పెంచి ఆసరాగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. మెప్మాలో విధులు నిర్వహిస్తున్న రిసోర్స్ పర్సన్‌ల వేతనాలను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఆర్పీలు సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి కెసిఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే జోగురామన్న ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసి ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌ను శాలువా, పుష్పగుచ్చాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. తమ వేతనాలను పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వాత 2019లో ఆర్పీలకు మొదటిసారి రూ.4వేల వేతనం అందించడం జరిగిందన్నారు. తాజాగా మరో రూ.2వేల వేతనాన్ని పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఎంసీ శ్రీనివాస్, అధ్యక్షురాలు చెన్నమ్మ, కార్యదర్శి మంజూష, కోశాధికారి నీరజ, ఉమాదేవి, విఠాబాయి పలువురు ఆర్పీలు, ఓబీలు పాల్గొన్నారు.

లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



తలమడుగు : గాంధీ జయంతి సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి, సెక్రెటరీ డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో లింగి వృద్ధాశ్రమంలో సోమవారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పీసీఆర్ జడ్జి తులసి దుర్గారాణి మాట్లాడుతూ వృద్ధులను ప్రత్యేకంగా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వారు సంపాదించిన ఆస్తులు అనుభవిస్తున్నందున కనీసం వారికి కూడు, గూడు కల్పించాల్సిన అవసరముందన్నారు. అనంతరం వృద్ధాశ్రమంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. తలమడుగు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరీష్‌కుమార్ వైద్య సిబ్బందితో కలిసి ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి క్షమాదేశ్‌ండే, లింగి సర్పంచ్ రేవతి పొచ్చన్న, వృద్ధాశ్రమం జనరల్ సెక్రెటరీ శివన్న, సాయి బాబా ఆలయ పూజారి కిషన్ పంతులు, వృద్ధాశ్రమం మేనేజర్ పసుపుల రాజు పాల్గొన్నారు.

సోమగూడెంలో చోరీ

కాసిపేట: సోమగూడెం గ్రామానికి చెందిన అచ్చె అర్జయ్య ఇంట్లో రూ.6,50,000 విలువ గల బంగారం చోరీకి గురైనట్లు కాసిపేట ఎస్ఐ గంగారాం తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం..అర్జయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి ముంబైలో తన బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరని గుర్తించిన దొంగలు ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలను దొంగలించారు. అర్జయ్య బంధువు రాగులు సతీశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. ఎవరైన ఊరికి వెళ్లినప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
మంగళవారం | అక్టోబర్ 03, 2023 | www.navatelangana.com

గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని పార్టీ ఎన్నికల మెనిఫెస్టో అమలు కమిటీ చైర్మెన్ శ్రీధర్‌బాబు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గాంధీ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ముందుగా పార్టీ శ్రేణులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ గతంలో గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసిన ఘనత పార్టీదని గుర్తు చేశారు. గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం దిశగా పార్టీ పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంద్రవెల్లి, ఉట్నూర్ మండలాల అధ్యక్షులు ఉత్తం, ఖయ్యుం, ఎండీ జహీర్, జితేందర్, మహిళ మండల అధ్యక్షురాలు లక్ష్మి ప్రకాష్, నాయకులు బాబాసాహెబ్, అజయ్, మాణిక్‌రావ్, భగవాన్ పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

నవతెలంగాణ-నార్నూర్



బీఆర్ఎస్ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలని ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జెడ్పీ చైర్మెన్లు రాథోడ్ జనార్ధన్, కోవా లక్ష్మి అన్నారు. సోమవారం గాదిగూడ మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజల్లో తీసుకెళ్లాలని సూచించారు. ముందుగా మండలంలోని గ్రామాల్లో పర్యటించారు. లోకారి(కె) గ్రామంలో కుమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చంద్రకళ రాజు, ఆసిఫాబాద్ గ్రంథాలయ సంస్థ చైర్మెన్ కనక యాదవ్‌రావ్, బీఆర్ఎస్ నాయకులు మర్సుకొల తిరుపతి, అయా గ్రామాల సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బీసీలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీసీలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించని పక్షంలో అగ్రకుల దొరలకు ఇవే చివరి ఎన్నికలు కానున్నాయని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. సోమవారం ఆదిలాబాద్‌కు వచ్చిన ఆయన బీసీ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. అధికార బీఆర్ఎస్ పార్టీ ప్రకటించిన 115 టిక్కెట్లలో 60 శాతం జనాభా కలిగి 136 కులాలున్న బీసీలకు కేవలం 23 సీట్లతో మొండి చేయి చూపి కేసీఆర్ బీసీ వ్యతిరేకిగా నిలిచారన్నారు. 5 శాతం ఉన్న రెడ్డి సామాజిక వర్గానికి 40 సీట్లు, అర శాతమున్న వెల్మలకు 12 స్థానాలు కేటాయించారన్నారు. కాంగ్రెస్, బీజేపీలు సీట్ల కేటాయింపులో బీసీ వాటా ఎంతో తేల్చాలని డిమాండ్ చేశారు. తగిన ప్రాధాన్యం దక్కనితరుణంలో జనాభాలో మెజార్టీ శాతంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు.

లింగాపూర్‌ను మండలంగా ఏర్పాటు చేయొద్దు



నవతెలంగాణ-కడెం

లింగాపూర్ గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయొద్దని, లింగాపూర్ సమీప గ్రామాలైనా కొత్తమద్దిపడగ, నర్సాపూర్, ధర్మాజీపేట్, నచ్చన్‌ఎల్లాపూర్, చిట్యాల్, పాతమద్దిపడగ, లక్ష్మీసాగర్ గ్రామాల ప్రజలు సోమవారం మండలకేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. ప్రజలు తమ గ్రామాలను నూతనంగా ఏర్పాటు కానున్న లింగాపూర్ మండలంలో కలపవద్దని లింగాపూర్ మండలం వద్దు కడెం మండలం ముద్దు అంటూ నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కలిసికట్టుగా ప్రజల సౌలభ్యంగా ఉన్న కడెం మండలం నుంచి కొందరి స్వార్ధ రాజకీయం కోసం లింగాపూర్ సమీప గ్రామాల ప్రజల అభిప్రాయం తెలుసుకోకుండా నూతనంగ లింగాపూర్ మండలం ఏర్పాటు చేసి తమ గ్రామాలను అందులో కలిపే ప్రయత్నం మానుకోవాలని కోరారు. లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయ గ్రామాల ప్రజా ప్రతినిధులు, నాయకులు జాడి ఇందుర్, సునారికారి రాజేష్, రాజు నాయక్, ప్రవీణ్, శేఖర్, రాజేశ్వర్‌గౌడ్, రాజేష్, బాదురావ్ పాల్గొన్నారు.

వజ్రోత్సవాలు చేసుకుంటున్నా దేశం వెనుకబడే ఉంది

- మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అవినీతి, కులవివక్ష, విద్వేష రాజకీయాలతోనే స్వతంత్ర వజోత్సవాలు నిర్వహించుకుంటున్న తరుణంలోనూ దేశం వెనకబడి ఉండటానికి ప్రధాన కారాణాలుగా నిలుస్తున్నాయని మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అన్నారు. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అధ్యక్షతన, జాగో తెలంగాణ ఆధ్వర్యంలో స్థానిక పీఆర్టీయూ సంఘ భవనంలో సోమవారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యావంతులు, మేధావులు, వివిధ వర్గాల ప్రజలతో నేటి రాజకీయ వ్యవస్థ, పార్టీల విధానాలు, అవినీతి, ఆర్థిక దోపిడి వంటి అంశాలపై చర్చించారు. విభజన, విద్వేష, కుల రాజకీయాలు, అవినీతి, ఆర్థిక దోపిడిపై ప్రజలను చైతన్య పరుస్తున్నామన్నామని అన్నారు. విభజన రాజకీయాలు, అవినీతి తారాస్థాయికి చేరాయని గతంలోనూ అవినీతి ఉన్నా ఈ స్థాయిలో ఉండేది కాదన్నారు. ఇలాంటి విద్వేషపూరిత రాజకీయాలపై ప్రజలు చైతన్యవంతులు కావాల్సిన అవసరముందన్నారు. ఈ సమావేశంలో శశికాంత్, డా. పృథ్వీరాజ్, నైనాల గోవర్ధన్, సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, ఫయాజ్ అహ్మద్ షామ పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నవతెలంగాణ-జైనథ్

మండలంలోని భోరజ్ చెక్ పోస్ట్ సమీపంలోని తెలంగాణ దాబా సమీపంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్టు ఎస్సై పురుషోత్తం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం దాబా సమీపంలో గుర్తు తెలియని మృతదేహం కనబడటంతో అక్కడి స్థానికులు తమకు సమాచారం అందించారని అన్నారు. వెంటనే సమాచార స్థావరానికి చేరుకోగా ఆ వ్యక్తి (42) మహారాష్ట్ర వాసిగా కనబడుతున్నాడని నీలిరంగు టీషర్ట్‌ని ధరించి ఉన్నాడని ఎవరైనా గుర్తుపట్టినచో పోలీస్ స్టేషన్‌లో తెలుపాలని అన్నారు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

పంచాయతీల్లో గ్రామ సభలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా మండలంలోని అన్ని పంచాయతీల్లో సర్పంచుల ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. ముత్నూర్‌లో డీఎల్పీఓ భిక్షపతిగౌడ్ హాజరయ్యారు. ఇంద్రవెల్లిలో సర్పంచ్ కోరెంగ గాంధారి అధ్యక్షతన గ్రామ సభను నిర్వహించారు. పలు అభివృద్ధి పనులపై తీర్మానం చేశారు. గ్రామసభల్లో ఎంపీఓ ఆడెపు సంతోష్ కుమార్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధే ధ్యేయం

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ-లక్ష్మణచాంద

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధియే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బోరిగాం గ్రామంలో నూతనంగా నిర్మించిన 20 వేల మెట్రిక్ టన్నుల గోదామును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యం సకాలంలో అమ్ముకొనెల ప్రతీ మండలంలో గోదాముల నిర్మాణాలు చేపడుతున్నట్టు తెలిపారు. గతంలో లేని విధంగా రాష్ట్రంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. యువత అవకాశలను అందిపుచ్చుకొని పారిశ్రామిక రంగంలో ఎదగాలన్నారు. 4న మంత్రి కేటీఆర్ నిర్మల్ జిల్లాలో పర్యటిస్తారని తెలిపారు.

విలేకరుల ఇండ్ల స్థలాలు మంజూరుకు మంత్రి హామీ...

జిల్లాలోని విలేకరులకు ఇండ్ల స్థలాలు మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు. లక్ష్మణచాంద మండలనికి చెందిన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీలతకు మంత్రి సభ వేదికగా ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మెన్ రాంకిషన్‌రెడ్డి, జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి అడ్వాల రమేష్, సర్పంచ్ మధాస్తు లక్ష్మి, మండల ఇన్‌చార్జి సురేందర్‌రెడ్డి, కన్వీనర్ కృష్ణారెడ్డి, కాంట్రాక్టర్ లక్కడి జగన్ మోహన్‌రెడ్డి, లక్కడి జైపాల్‌రెడ్డి, ఎంపీటీసీ గణేష్, నాయకులు అర్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

- టీజేఎస్ ముధోల్ నియోజకవర్గ ఇన్‌చార్జీ సర్దార్ వినోద్ కుమార్



నవతెలంగాణ-కుభీర్

ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని టీజేఎస్ ముధోల్ నియోజకవర్గ ఇన్‌చార్జీ సర్దార్ వినోద్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశ వర్కర్లు చేపట్టిన సమ్మెకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్ల సమస్యలను కేసీఆర్ ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని లేనియెడల మరిన్ని పోరాటలను ఉధృతం చేస్తామని, అన్నారు. ఆశ వర్కర్ల సమస్యలను కేసీఆర్ ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీంతో వారికి కనీస వేతనం రూ.18వేలు, ఇవ్వాలని అలాగే పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. దీంతో పాటు ప్రమాద బీమా సౌకర్యం రూ.5లక్షల వరకు ఇవ్వాలని అలాగే ఏఎన్ఎం, జీఎన్ఎం పోస్టులలో సీనియర్ ఆశాలకు ప్రమోషన్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ నాయకులు పల్లపు తులసిరామ్, టీజేపీసీ ముధోల్ మండల అధ్యక్షులు మీనాజ్, కుభీర్ నాయకులు ఆరిఫ్, హనుమంతు, ఆశాలు సులోచన, కవిత, లక్ష్మి, లావణ్య, రేఖ, మమత పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భవ నిరుపేదలకు ఎంతో మేలు

నవతెలంగాణ-తాంసి



ఆయుష్మాన్ భవ ఆరోగ్య కార్డులు నిరుపేద కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతాయని భీంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.నిఖిల్‌రాజ్ అన్నారు. సోమవారం ఆయుష్మాన్ భవ ఆరోగ్య కార్డులపై పీహెచ్‌సీ పరిధిలోని అందర్‌బంద్, అర్లి, భీంపూర్, ధనోర, గిరిగాం, కరంజి గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించారు. మొదటగా జాతి పిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామసభ నిర్వహించి, కార్డుల జారీ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్ల రేషన్ కార్డులు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ కార్డులు పొందవచ్చు అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఈ కార్డుల వల్ల ధీర్ఘకాలిక వ్యాధులు, శస్త్ర చికిత్సలకు రూ. ఐదు లక్షల ఖర్చులు ఉపయోగించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తీర్ణాధికారి లింగంపల్లి జ్ఞానేశ్వర్, సర్పంచ్ మడావి లింబాజి, పర్యవేక్షకులు బి.గంగాధర్, ఎంఎల్‌హెచ్‌పీలు దివ్య, సంధ్యారాణి, వివేక్ ఆరోగ్య కార్యకర్తలు లచ్చుబాయి, సుజాత, విజయలక్ష్మి, జానాబాయి, సరస్వతి, నఫీజ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు

పొన్నారిలో...

తాంసి మండల కేంద్రంతో పాటు పొన్నారి గ్రామంలో ప్రజలకు ఆరోగ్యశ్రీ ఆయుష్మాన్ భవ కార్డులపై అవగాహన కల్పించారు. గతంలో ఆరోగ్యశ్రీ సంవత్సరానికి రూ.2 లక్షల ఉంటే ప్రస్తుతం ఐదు లక్షల వరకు వినియోగించుకోవచ్చని ఆరోగ్యశ్రీ మిత్ర భారత్, సిరిగిరి విశ్వనాథ్ అన్నారు. మంగళవారం బండల్‌నాగపూర్, కప్పర్ల గ్రామాల్లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అశోక్, తాంసి ఉపసర్పంచ్ కాంతరెడ్డి వార్డు సభ్యులు కళ్యాణ్, విలాస్, లక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆస్తి కోసం సొంత తమ్ముడి హత్య

- పథకం ప్రకారం కొడుకుతో కలిసి కిరాతకం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ గంగారెడ్డి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

ఆస్తి కోసం సొంత తమ్ముడిని హత్య చేసిన ఘటనలో డీఎస్పీ గంగారెడ్డి సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన సిలారి పెద్ద మల్లయ్య, సిలారి చిన్న మల్లయ్యకు మధ్య చాలా సంవత్సరాలుగా భూమికి సంబంధించిన గొడవలు జరుగుతూ ఉన్నాయి. పలుమార్లు గ్రామ పెద్దమనుషులు నచ్చజెప్పిన వారికి రాజీ కుదరలేదు. వారి ఇద్దరి ఇండ్లు కూడా పక్కపక్కనే ఉండటంతో ఏ చిన్న గొడవ జరిగినా అది పెద్ద గొడవకు దారితీసేది. గొడవలు జరిగిన ప్రతీసారి అన్న తమ్మునిపై దాడికి దిగేవాడు. వీరి దౌర్జన్యాన్ని తట్టుకోలేక అన్న, అన్న కొడుకు మహేష్‌పై తమ్ముడు కేసులు పెట్టేవాడు. దీంతో తమ్ముడిపై కోపం పెంచుకున్న అన్న పెద్ద మల్లయ్య(పెద్ద మల్లు) తన తమ్ముడిని చంపుతే, తమ్ముడి వాటా ఇల్లు, భూమి తనకు చెందుతాయని కొడుకుతో కలిసి కుట్ర పన్నాడు. శుక్రవారం ఉదయం చిన్న మల్లయ్య, పెద్ద మల్లయ్య భార్యల మధ్య వాకిలి విషయంలో చిన్న గొడవ జరిగింది. దీనినే అదనుగా భావించిన తండ్రీకొడుకులు, పథకం ప్రకారం ఎలాగైనా సిలారి చిన్న మల్లయ్యను చంపాలనే ఉద్యేశంతో మాంసం కొట్టే కత్తి, ఇనుప రాడ్ తీసుకొని చిన్న మల్లయ్య కోసం వెతికారు. చివరికి అతడు ఊరు చౌరస్తాలో ఉన్న విషయం గమనించి మాటువేశారు. ఒక్కసారిగా చిన్న మల్లయ్యపై దాడి చేసి కత్తితో నరికి, ఇనుప పైప్‌తో కొట్టడం మొదలు పెట్టారు. వారి నుంచి తప్పించుకోవడానికి దూరంగా పరిగెట్టాడు మృతుడు. అయినా నింధితులు అతన్ని విడిచిపెట్టలేదు. చిన్న మల్లయ్య వెంబడించి, వెంటాడి దాడి చేసి విచక్షణారహితంగా నరికారు. దీంతో బాధితునికి తీవ్ర రక్తస్రావం జరిగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. ఈ ఘటన ఊరు నడి బొడ్డున పట్టపగలే జరిగింది. అది కూడా అందరూ చూస్తుండగానే చోటుచేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని, చిన్న మల్లయ్యను నిర్మల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌లోని ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. బాధితుడు అక్కడ చికిత్స పొందుతూ నిన్న శనివారం చనిపోయాడు. నింధితులు ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. నిందితుల వద్ద నుంచి ఒక మోటార్ సైకిల్, కర్ర, కొడవలి, మాంసం కొట్టే కత్తి, ఇనుపరాడ్ స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన సోన్ సీఐ నవీన్ కుమార్, లక్ష్మణచాంద ఎస్సై శ్రీకాంత్, సోన్ ఎస్సై రవీందర్, మామడ ఎస్సై రాజు, సోన్ సర్కిల్ పోలీసు సిబ్బందిని డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛత వారోత్సవాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్, కామర్స్ డిగ్రీ కళాశాలలో గాంధీ జయంతిని పురస్కరించుకొని వారం రోజుల నుండి స్వచ్ఛత వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. సోమవారం కళాశాలలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ అనిత మాట్లాడుతూ వారం రోజుల పాటు రోజు ఒక గంట పాటు వివిధ కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థులు, అధ్యాపకులు ఆవరణలో గడ్డి, చెత్తను తీసిపారేయడంతోపాటు, స్వచ్ఛత అవగాహన సదస్సు, స్వచ్ఛత ప్రతిజ్ఞ, మొక్కలు నాటడం, స్వచ్ఛత ప్రాముఖ్యతపై వివిధ పోటీలను నిర్వహించి బహుమతులను ప్రధానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



నవతెలంగాణ-జైనథ్

ఎల్లవేళల సహాయం అందించే ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ అని కాప్రి గ్రామ సర్పంచ్ రమీల వెంకటరెడ్డి అన్నారు. సోమవారం మధ్యాహ్నం కాప్రి గ్రామంలో అనారోగ్య బాధితులైన వారికి సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అందులో బద్దం రాధాబాయికి రూ.37వేలు, ఏల్మ గీతకి రూ.12వేలు, ఏనుగు నరేష్‌రెడ్డికి రూ.11వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. అదేవిధంగా ఆసరా పింఛన్ కార్డులని గడమాల లక్ష్మికి, తాళ్లపల్లి గౌరుబాయికి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఇందిరా రామిరెడ్డి, కార్యదర్శి సూరజ్ పాల్గొన్నారు.

జర్నలిస్టులకు రక్షణ చట్టాన్ని అమలు చేయాలి

నవతెలంగాణ-దిలావర్‌పూర్

జర్నలిస్టులకు రక్షణ చట్టాన్ని అమలు చేయాలని టీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సభ్యుడు పున్నం చందు అన్నారు. సోమవారం నర్సాపూర్(జి) మండల కేంద్రంలో ఐజేయూ పిలుపుమేరకు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మీడియా రక్షణ చట్టాన్ని అమలు చేయడంతో పాటు ప్రత్యేక మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయాలని అన్నారు. అక్రిడేటెడ్ జర్నలిస్టులకు రైల్వే పాస్ పునరుద్దరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల జర్నలిస్టులు సంతోష్, రామ్, రాములు, రవికుమార్, తోకల మహేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సారంగాపూర్ : జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) పిలుపు మేరకు సారంగాపూర్ మండల జర్నలిస్టులు సోమవారం గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. దేశంలో మీడియా రక్షణ చట్టం అమలు, మీడియా కమిషన్ ఏర్పాటు, అక్రిడెటెడ్ జర్నలిస్టులకు రైల్వే పాస్ పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల జర్నలిస్టులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలి

- డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు



నవతెలంగాణ-సారంగాపూర్

ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు అన్నారు. సోమవారం మండలంలోని సిరిపెల్లి, బండ్రేవు తండా, పొట్యాతండ, రాంసింగ్ తండ గ్రామాల్లో పార్టీ ఆధ్వర్యంలో వస్తున్న మీకోసం పాదయాత్రను చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని ప్రజలతో మాట్లాడుతూ వారి సమస్యలు తెలుసుకున్నారు. సోనియా గాంధీ ప్రకటించిన ఆరు హామీల కరపత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. మహాత్మా గాంధీ కన్న కలలు సాకారం కావాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యం అవుతుందన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్, నిర్మల్‌లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రజలకు హామీలు ఇచ్చి విస్మరించారని ఆరోపించారు. గిరిజన గుడాల్లో నేటికీ రోడ్డు సౌకర్యం లేదని, పల్లెల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. మండలంలో ఇప్పటి వరకు ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలేదన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీలు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, సోనియా సంతోష్, న్యాయవాది మల్లారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దశరథ రాజేశ్వర్, పీసీసీ సభ్యుడు సాద సుదర్శన్, మాజీ జడ్పీటీసీలు నర్సయ్య, మారుతి, హది, ఏనుగు లింగారెడ్డి, విలాస్‌రావు, రాథోడ్ భీమ్‌రావు, అంబాజీ, దినేష్, జాదవ్ దశరథ్, ఒడ్నం రాజేశ్వర్, రమణరెడ్డి, జయంత్ పటేల్, చిన్ను, జునైత్, ఖీజర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నైనత



నవతెలంగాణ-జైనథ్

ప్రతి ఒక్కరూ వందశాతం ప్రభుత్వ పథకాల సద్వినియోగం చేసుకోవాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నైనత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల గురించి, అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఆరోగ్య పథకాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని అన్నారు. ఎల్లవేళలా మీకు సాయం చేయడానికి చేయూత ఇస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దుమాల దేవన్న, ఎంపీటీసీ సుదర్శన్, కార్యదర్శి ముజీబ్‌ఖాన్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కుమురంభీం ఆసిఫాబాద్
మంగళవారం | అక్టోబర్ 03, 2023 | www.navatelangana.com

మానవత్వం చాటుకున్న సిర్పూర్ పోలీసులు

నవతెలంగాణ-సిర్పూర్(టి)



పోలీసులు ప్రజల రక్షణకే కాకుండా ఆపత్కార పరిస్థితుల్లో ఉన్న వారికి అండగా నిలుస్తున్నారు. తాజాగా సిర్పూర్ మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన తోట కళావతి అనే మహిళ గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె కూతుళ్ల ఆర్థిక పరిస్థితి భాగలేదని తెలుసుకున్న పోలీసులు రూ.ఐదు వేల ఆర్థికసాయం, 50 కిలోల బియ్యం, నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై దీకొండ రమేష్ మాట్లాడుతూ మృతురాలి భర్త గత కొన్ని సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మరణించాడు. తల్లి కూడా మృతి చెందడంతో వారి పరిస్థితి దయనీయంగా మారడంతో తాము అండగా ఉంటామని పోలీసులు ముందుకు రావడంతో పలువురు అభినందిస్తున్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-బెజ్జూర్



మండలంలోని సోమిని గ్రామంలో జడ్పీటీసీ పుష్పలత ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే కోనేరు కోనప్ప చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. గత కొన్ని సంవత్సరాల నుండి బెజ్జూర్ నుండి సోమినికి రోడ్డు మార్గం సక్రమంగా లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. అటవీ అనుమతులు లేని కారణంగా పనులు ముందుకు సాగడం లేదు. ఈ క్రమంలో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అటవీ అనుమాతులు తీసుకువచ్చారు. దీంతో ఆయన చిప్రటానికి పాలాభిషేకం నిర్వహించి ధన్యవాదలు తెలిపారు. అటవీ శాఖ అనుమతితో బెజ్జూర్ నుండి సోమిని రోడ్డుక మార్గం సుగగమైందని, సోమిని గ్రామస్తుల రవాణా ఇబ్బందులు తీరనున్నాయని జడ్పీటీసీ పుష్పలత హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు శంకర్, శారద, అనిల్, నాయకులు చంద్రశేఖర్, దుర్గం శంకర్ పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పరిసరాల పరిశుభ్రతపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి యువరాజ్ తెలిపారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని కోర్టు ఆవరణలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు పాల్గొన్నప్పుడే పరిసరాల పరిశుభ్రత సాధ్యమవుతుందన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా ఉండాలంటే పరిసరాలు శుభ్రంగా ఉండాలని సూచించారు. అనంతరం సబ్ జైల్‌లో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో ఎస్పీ అచ్చేశ్వరరావు పాల్గొని ఖైదీలతో మాట్లాడి వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జైల్ సూపరిండెంట్ ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపై నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కోవలక్ష్మి, జడ్పీటీసీ నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్ పాల్గొని రోడ్లు శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, నాయకులు అహ్మద్, సుగుణాకర్, నిసార్, వెంకన్న, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం



నవతెలంగాణ-కౌటాల

కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) 25వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం మండలంలోని ముత్యంపేట్‌లో జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం రాజ్‌కుమార్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత జాతి సంక్షేమం కోసం పోరాటానికి ముందుంటుందన్నారు. దళితుల సంక్షేమానికి పథకాలు అమలుచేస్తానని వాగ్దానాలు చేసిన సీఎం కేసీన విస్మరించారని ఆరోపించారు. ఇచ్చిన హామీలన్నీ పేపర్లకే పరిమితమవుతున్నాయన్నారు. దళితుల ఓట్లను రాజకీయ ఎదుగుదలకు వాడుకుంటు వారిని పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. పేద ప్రజలు ఎక్కడ గుడిసెలు వెసుకున్న దళితులను ధనవంతులు దౌర్జన్యం చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక పోరాటాలు చేసి చట్టాలు సాధించిన ఘనత కేవలం కేవీపీఎస్‌కు ఉందన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వాలు దళిత జాతి సంక్షేమం కోసం పాటుపడాలని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కేవీపీఎస్ నిర్వహించే పోరాటానికి దళిత సమాజం అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. వారం రోజుల పాటు నిర్వహించే ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్, ముంజన్‌కార్ శంకర్, డోంగ్రి తనూజీ, గొమాసి శ్రావన్ పాల్గొన్నారు.

గిరిజన యూనివర్సిటీ ప్రకటన ఒక చరిత్ర

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రానికి ప్రధాని మోడీ గిరిజన యూనివర్సిటీ ప్రకటించడం ఒక సువర్ణ అధ్యయనమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అజ్మీర ఆత్మరామ్ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.900 కోట్లతో గిరిజన యూనివర్సిటీ ప్రకటించడం గొప్ప విషయం అన్నారు. దీనితోపాటు అనేక అభివృద్ధి పనులకు శంకుస్థాపన ప్రారంభోత్సవాలు చేసిన మోడీకి తెలంగాణ ప్రజలు రుణపడి ఉంటారన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా తెలంగాణకు బీజేపీ ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బానోత్ వెంకట్ నాయక్, జిల్లా యువ మోర్చా అధ్యక్షులు ఎలుగతి సుచిత్, ఆసిఫాబాద్ మండల అధ్యక్షులు మద్దెల శ్రీధర్, కెరమేరి మండల అధ్యక్షులు వేణు, దళిత మోర్చా ఉపాధ్యక్షులు జయరాజ్, నాయకులు సూర్యప్రకాష్, సప్త శ్రీనివాస్, జవాన్, కిషన్, ప్రేమ్ దాస్, సతీష్, జనార్ధన్, భీమయ్య, బబ్లు, రవినాయక్, సాగర్, గోపి, సంజీవ్, పాల్గొన్నారు.

పురుగులమందు తాగి ఒకరి ఆత్మహత్య

నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని నాగుల్వాయి గ్రామానికి చెందిన సాకిరె భీమయ్య(55) ఆదివారం రాత్రి పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్సై విక్రమ్ తెలిపారు. చిన్న కుమారుడు ప్రేమ వివాహం చేసుకోవడంతో మనస్తాపం చెందిన భీమయ్య తాగుడుకు బానిసయ్యాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆదివారం రాత్రి పురుగులమందు తాగి ఆత్మహత్య పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న భీమయ్యను వైద్యం కోసం కాగజ్‌నగర్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు. భార్య తారాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్టు ఎస్సై తెలిపారు.

రేపు హ్యాండ్ బాల్, ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో రేపు అనగా ఈ నెల 4న బుధవారం హ్యాండ్ బాల్, ఫుట్ బాల్ అండర్-17, అండర్-14 బాల బాలికల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా పాఠశాల క్రీడల ప్రధాన కార్యదర్శి సాంబశివరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అథ్లెటిక్స్‌లో పాఠశాలల అండర్-17, అండర్-14 బాల బాలికల ఎంపిక పోటీలు నిర్వహించడం జరుగుతుందని, దీనికోసం హ్యాండ్ బాల్ పోటీలు మీనా రెడ్డి నేతృత్వంలో గిరిజన ఆదర్శ క్రీడ పాఠశాలలో, ఫుట్బాల్ పోటీలు క్రీడా శిక్షకుడు రవి నేతత్వంలో తెలంగాణ గిరిజన బాలికల పాఠశాలలో నిర్వహించడం జరుగుతుందని, ఆసక్తి అర్హత గలవారు ఉదయం 9 గంటల వరకు ఆయా కేంద్రాలకు చేరుకోవాలని పేర్కొన్నారు.

గాంధీ మార్గంలో ప్రతి ఒక్కరు పయనించాలి

- జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహానికి పూలమమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి

బ్రిటిష్ బానిసత్వ సంకెళ్ల నుంచి స్వాతంత్ర్యం సాధించిన మహనీయుడు మహాత్మా గాంధీ అని ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు పయనించాలని జడ్పీ చైర్ పర్సన్ కోవలక్ష్మి అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్‌లో జడ్పీటీసీ నాగేశ్వరరావు ఎంపీపీ మల్లికార్జున్‌తో కలిసి గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాంధీ చూపిన శాంతి సామరస్యం ద్వారా ఏ సమస్య అయినా పరిష్కరించుకోవచ్చని శాంతియుతంగా పోరాడి దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చి గొప్ప వ్యక్తి గాంధీజీ అన్నారు. నేటి యువత ఆయన మార్గంలో పయనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, మాజీ ఎంపీటీసీ సుగుణాకర్, నాయకులు హైమద్, గుండ వెంకన్న, నిస్సార్, ఎండీ అహ్మద్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో..

గాంధీ జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో కలెక్టర్ బొర్కాడే హేమంత్, అదనపు కలెక్టర్ దాసరి వేణు, కాగజ్‌నగర్ ఆర్డీఓ రాజేశ్వర్‌తో కలిసి మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ రఫత్ హుస్సేన్, డీఈఓ ఉదయ బాబు, డీఎంహెచ్ఓ తుకారాం పాల్గొన్నారు.

వివిధ సంఘాల ఆధ్వర్యంలో..

వైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. వాసవి క్లబ్ అధ్యక్షులు కోడిప్యాక రవీందర్, సెక్రటరీ అభిలాష్, కోశాధికారి గుండా సాయి పాల్గొన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సిబ్బంది సతిదేవి, వెంకటరమణ, సలీం, రామయ్య పాటకులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. బాలరక్ష భవన్‌లో డీసీపీఓ మహేష్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగ సంఘ భవనంలో మహాత్మా గాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రిల జయంతిని సంఘ నాయకులు శ్రీరాములు, శంకర్, లింగయ్య, రమేష్, సుభాష్ సింగ్, కిష్టయ్య, మధుసూదన్, వెంకటేశం, పోచయ్య, రాజేశ్వర్ ఘనంగా నిర్వహించారు.

కౌటాల : గాంధీ జయంతి వేడుకలను మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మౌనీష్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గాంధీ చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ప్రత్యేక గ్రామసభ నిర్వహించి పలు పనుల కోసం తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పసునూరి తిరుపతి, బీఆర్ఎస్ యువజన సంఘం మండల అధ్యక్షుడు తాళ్లపెల్లి రవీందర్ గౌడ్, నాయకులు డబ్బ బాపు పాల్గొన్నారు.

బెజ్జూర్ : మండలంలో గాంధీ జయంతిని పురస్కరించుకొని సోమవారం ఆయా గ్రామ పంచాయతీల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. మండలకేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. గాంధీ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని, పల్లెల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు పాటుపడాలని ఆర్యవైశ్య సంఘం నాయకులు బోగ రమేష్, సంతోష్, మహేష్, శంకరయ్య కోరారు.

దహెగాం : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సమ్మె శిబిరంలో గాంధీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గాంధీజీ చిత్రపటానికి వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు వజ్రమ్మ, రూప, ఈశ్వరి, మమత, గౌసియా పాల్గొన్నారు. అలాగే మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలోనూ మహాత్మాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ విజయకుమార్, మధూకర్‌తో పాటు పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : మండలకేంద్రంలోని రామాలయ ఆవరణలో గాంధీ జయంతి సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు రాజన్న, బాపూజీ, వైకుంఠం, నాగేష్, వెంకటేశ్, నరేందర్, కృష్ణ, రాజు, రమేష్, శ్రీనివాస్, రామన్న, సంతోష్, కృష్ణ, ప్రభాకర్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.



కౌటాల : జీపీ కార్యాలయంలో గాంధీ జయంతి



బెజ్జూర్ : గాంధీ విగ్రహానికి పాలాభిషేకం



దహెగాం : గాంధీ చిత్రపటానికి అంగన్‌వాడీల వినతి



ఆసిఫాబాద్ : కలెక్టరేట్‌లో గాంధీ జయంతిలో కలెక్టర్

వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- అటవీ క్షేత్రాధికారి అప్పలకొండ
- వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆసిఫాబాద్ : జాతీయ వన్యప్రాణి వారోత్సవాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న అటవి అధికారి అప్పకొండ

అడవులు, వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని ఆసిఫాబాద్ అటవీ క్షేత్రాధికారి అప్పలకొండ అన్నారు. జాతీయ వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయం నుంచి అటవీ శాఖ సిబ్బంది విద్యార్థులతో కలిసి తీసిన ర్యాలీకి ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల సంరక్షణతో వాతావరణ సమతుల్యత సాధ్యమవుతుందని అన్నారు. కేవలం అటవీ అధికారులతో మాత్రమే సంరక్షణ సాధ్యం కాదని దీనిలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. వన్యప్రాణుల సంరక్షణకు సిబ్బంది నడుంకట్టాలని తెలిపారు. జిల్లాలో అటవీ ప్రాంతం సంరక్షించడంతో పాటు వన్య ప్రాణులను కూడా రక్షించాలని తెలిపారు. వన్యప్రాణులు సంరక్షణతో జీవవైవిద్యం పెరుగుతుందన్నారు. దీనికోసం ప్రజల సహాయ సహకారాలు అవసరమని తెలిపారు. వన్యప్రాణుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయని ప్రజలకు వాటిపై అవగాహన కల్పించి శిక్షల విధానాన్ని తెలియజేయాలని అన్నారు. అటవీ ప్రాంతం సంరక్షణ కోసం ప్రజలతో ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ప్రజలతో మమేకమై పనిచేసినప్పుడే అటవీ సంరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా అటవీ సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని అన్నారు. జిల్లా కార్యాలయం నుండి ప్రారంభమైన ర్యాలీ కలెక్టరేట్ మీదుగా వివేకానంద చౌక్, అంబేద్కర్ చౌక్, కొమరంభీం చౌక్ మీదుగా జిల్లా కార్యాలయానికి చేరుకుంది. అనంతరం జిల్లా కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి అటవీ సంరక్షణపై చేసిన ప్రసంగానికి విద్యార్థిని సన్మానించి బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారులు యోగేష్, ఝాన్సీరాణి, ప్రవీణ్ కుమార్, రేంజ్ పరిధిలోని సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : 69వ జాతీయ వన్యప్రాణుల సంరక్షణ కార్యక్రమంలో భాగంగా పెంచికల్‌పేట్ రేంజ్ పరిధిలో అగర్‌గూడ, కమ్మర్‌గాం గ్రామాల్లో అటవీ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు, ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. పులులు, పక్షులు, రాంబంధులు వాటి ఆవశ్యకతను, వాటి సంరక్షణ విధానంపై డిప్యూటీ రేంజ్ అధికారి ప్రభాకర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సెక్షన్ అధికారి జగన్మోహన్ గౌడ్, బీట్ అధికారులు వెంకటేశ్, దినేష్, మహేష్, పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య, గ్రామస్తులు, విద్యార్థులు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బెజ్జూర్ : అటవీలో వన్యప్రాణుల మనుగడ అత్యంత అవసరమని బెజ్జూర్ ఎఫ్ఆర్ఓ దయాకర్ అన్నారు. సోమవారం మండలంలో జాతీయ వన్యప్రాణుల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించి వన్యప్రాణుల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. వన్యప్రాణులు ఉంటేనే మానవ మనుగడ సాధ్యమవుతుందని, వాటినీ వేటాడకూడదని సూచించారు. వన్యప్రాణుల వారోత్సవాలను ఈ నెల 8 వరకు నిర్వహిస్తున్నామని, అన్ని గ్రామాల్లో వన్యప్రాణులపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పుష్పలత, సర్పంచ్ శారద, డిప్యూటీ ఆర్ఓ శ్రావన్, నాయకులు కొట్రంగి రామకృష్ణ, జావీద్ అలీ, మహేష్, నరేందర్ గౌడ్, జాహిద్ పాల్గొన్నారు.

మీడియా రక్షణ చట్టాన్ని అమలు చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

దేశంలో మీడియా వ్యవస్థకి రక్షణ లేకుండా పోతుందని వెంటనే కేంద్ర ప్రభుత్వం దేశంలో మీడియా రక్షణ చట్టాన్ని అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం (టియుడబ్ల్యూజే-ఐజేయూ) జిల్లా అధ్యక్షులు అబ్దుల్ రహమాన్ డిమాండ్ చేశారు. సోమవారం గాంధీ జయంతి సందర్భంగా జిల్లా కలెక్టరేట్ ఎదుట ఐజేయూ పిలుపుమేరకు టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు జర్నలిస్టులపై ఆంక్షలు దాడులు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మీడియాకు స్వేచ్ఛ లేకుండా పోతుందని మండిపడ్డారు. దేశంలో మీడియా రక్షణ చట్టాన్ని అమలు చేసి వెంటనే మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అక్రిడేటెడ్ జర్నలిస్టులకు రైల్వే పాసులు యధావిధిగా పునరుద్ధించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐజేయూ కౌన్సిల్ సభ్యుడు ఎస్ వేణుగోపాల్, జిల్లా కోశాధికారి అడప సతీష్, జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణంరాజు, జిల్లా సహాయ కార్యదర్శి దేవనూరి రమేష్, ఎలక్ట్రానిక్ మీడియా విభాగం అధ్యక్షుడు బిక్కాజి, జిల్లా అక్రిడేషన్ కమిటీ మెంబర్ ప్రకాష్ గౌడ్, జిల్లా జర్నలిస్టులు సురేష్ చారి, శ్రీధర్, రాధాకృష్ణ చారి, మిలిన్ కుమార్, సయ్యద్ సోజర్, రాందాస్, రఫీక్, కుమార్, సురేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-రెబ్బెన

విద్యుత్ సరఫరాలో మంగళవారం అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ ఇమ్రాన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ మరమ్మత్తుల దృష్ట్యా నంబాల సబ్‌స్టేషన్ పరిధిలో గల గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సమస్యలు పరిష్కరించకుంటే మరో పోరాటానికి సిద్ధం

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్
- 8వ రోజు ఆశా వర్కర్ల సమ్మె

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆసిఫాబాద్ : గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించకుంటే మరో పోరాటానికి సిద్ధమవుతామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ హెచ్చరించారు. ఆశా వర్కర్ల 8వ రోజు సమ్మెలో భాగంగా సోమవారం గాంధీ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోకుంటే మరో పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు హెచ్చరించారు. కనీస వేతన స్థిర వేతన విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు ఇతర సమస్యల పరిష్కారం కోసం అవసరమైన చర్యలు తీసుకొని సమ్మె విరమించేలా చర్చలు జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల సంఘం జిల్లా నాయకులు అమరవాణి, పూజ, దేవత, దేవి, సంకు, లక్ష్మి, అరుణ, రేణుక, లావణ్య విజయ, సుమిత్ర, భారతి, మోతుబాయి, స్వప్న పాల్గొన్నారు.

బెజ్జూర్ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కొన్ని రోజుల నుండి సమ్మె బాట పట్టిన ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్నభోజన కార్మికులు ప్రభుత్వం మొండివైఖరి విడనాడాలని కోరుతున్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ సోమవారం గాంధీ జయంతిని పురస్కరించుకొని గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కండ్లు తెరిచి తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు సత్యశ్రీ కోరారు. గాంధీ విగ్రహానికి పాలాభిషేకం చేసి, వినతిపత్రం అందజేసి ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా చూడాలని కోరారు. మధ్యాహ్న భోజన కార్మికులు బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు, మధ్యాహ్నభోజన కార్మికులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : ఆశావర్కర్ల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి సోయం చిన్నయ్య అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న ఆశావర్కర్ల సమ్మెకు మద్దతుగా మండల అధ్యక్షుడు దేవాజీ ఆధ్వర్యంలో మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశావర్కర్ల 18 డిమాండ్లను పరిష్కరించాలని, వారి సమస్యలను పట్టించుకోకుండా చిన్నచూపు చూస్తుందన్నారు. ప్రతి ఇంటికి ఆరోగ్య రక్షకులుగా సేవలందిస్తున్న విస్మరించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి పాగిడె ఆశన్న, డీవీఎఫ్ కన్వీనర్ మహేష్, బీఎస్పీ మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : తమ సమస్యలు పరిష్కరించాలని గత కొన్ని రోజుల నుండి అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా గాంధీ జయంతిని పురస్కరించుకొని గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గాంధీజీ చిత్రపటానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలని నిరవధిక సమ్మెను చేస్తున్న పట్టించుకోకుండా కాలయాపన చేస్తుందని, ప్రభుత్వం మొండివైఖరి విడనాడాలని, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే విధంగా ఆలోచించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అర్చన, ఉమా, విమల, ఆశా కార్యకర్తలు కవిత, శ్యామల పాల్గొన్నారు.



సిర్పూర్(టి) : గాంధీ చిత్ర పటానికి వినతి పత్రం అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

చంద్ర బాబు అరెస్టు అప్రజాస్వామికం

నవతెలంగాణ-జన్నారం

తెలుగు దేశం పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని గత 23 రోజులుగా ఆంధ్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అరెస్ట్ చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి రాజేశ్వర్ అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని జన్నారం మండల కేంద్రంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉద్దేశ పూర్వకంగా చంద్రబాబును అరెస్ట్ చేసి రాక్షసానందం పొందుతున్నారన్నరు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్యానికి బదులు జగన్ స్వామ్యం రాజ్యమేలుతుందని దుయ్యబట్టారు. చంద్రబాబును అరెస్టు చేసి అతని కుటుంబాన్ని ఇబ్బందులకు గురిచేయడం జగన్ దిగజారుడుతనానికి ఇది నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఉప్పుల విజయ్ పార్లమెంట్ నాయకులు పులిషెట్టి శ్రీనివాస్, నవీన్ పాల్గొన్నారు.

4న చలో సంక్షేమ భవన్ విజయవంతం చేయండి

నవతెలంగాణ-కోటపల్లి

గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించాలని ఈ నెం 4న చలో సంక్షేమ భవన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఎస్.లావన్య, యూ.తిరుపతి సోమవారం ఒక ప్రకనలో పేర్కొన్నారు. పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్‌తో పాటు గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగున్నతులు నిర్వహిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేయకుండా తాత్సరం చేస్తున్నారన్నారు. గత కొన్నేండ్లుగా బదిలీలు, ఉద్యోగున్నతులు లేకుండా గిరిజన విద్యా వ్యవస్థ కుంటుపడుతుందన్నారు. రెగ్యులర్ ప్రధానోపాధ్యాయులు లేకపోవడం తో పాఠశాలల్లో పర్యవేక్షణ లేక ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గిరిజన సంక్షేమ అధికారుల నిర్లక్ష్యానికి నిరసనగా, తక్షణమే బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ 4న చలో సంక్షేమ భవన్ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమానికి గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల, గిరిజన ప్రాథ మిక పాఠశాలల ఉపాధ్యాయులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అహింసను చాటి చెప్పిన గాంధీ మహాత్ముడు

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-మంచిర్యాల

సత్యం, అహింస మార్గాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహాత్ముడు మోహన్ దాస్ కరంచంద్ గాంధీ అని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం గాంధీ జయంతిని పురస్కరించుకొని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, మంచిర్యాల మున్సిపల్ చైర్ పర్సన్ పెంట రాజయ్యతో కలిసి జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కులో గల మహాత్మా గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర ఉద్యమంలో అహింస, సత్యాగ్రహంతో మహాత్మా గాంధీ ముఖ్యపాత్ర పోషించారని, బాపూజీగా, జాతిపితగా, మహాత్మగా నిలిచారని అన్నారు. సహాయ నిరాకరణ, స్వదేశీ వస్త్రధారణ లాంటి అహింస మార్గాలలో స్వాతంత్రం కోసం పోరాటం చేశారని అన్నారు. మహాత్మా గాంధీ అహింసా మార్గాన్ని ఐక్యరాజ్యసమితి గుర్తించి గాంధీ జయంతి రోజున ప్రపంచ అహింసా దినోత్సవంగా ప్రకటించడం గర్వంగా ఉందని అన్నారు. మహాత్మా గాంధీ సత్యం, అహింస మార్గాలను తాను స్వయంగా ఆచరించి ఆదర్శంగా నిలిచారని అన్నారు.

కలెక్టర్ కార్యాలయంలో..

జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాహుల్‌తో కలిసి మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో...

గాంధీ జయంతిని పురస్కరించుకొని వేడుకలు ఘనంగా నిర్వహించారు. అలాగే 15 మంది పారిశుద్ధ కార్మికులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ పల్లి ప్రభాకర్, కమిషనర్ తన్నీరు రమేష్, ఆర్వో సతీష్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



మంచిర్యాల

తాండూర్ : గాంధీ జయంతి సందర్భంగా ఎంపీపీ పూసాల ప్రణయ్ కుమార్ ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ ఎంపీడీఓ కార్యాలయంలో గాంధీ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళు లర్పించారు. తాండూర్ ద్వారకాపూర్ గ్రామపంచాయతీలో ప్రత్యేక గ్రామ సభ లునిర్వహించారు.

తహసిల్దార్ కార్యాలయంలో...

భీమిని : మండలంలో తహసిల్దార్ కార్యాలయంలో మహాత్మా గాంధీ 154వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహాత్మా గాంధీ చిత్రపటానికి తహసీల్దార్ కర్ణదాస్ పూలమాలవేసి నివాళులర్పించారు,

మందమర్రి : కాంగ్రెస్ నాయకులు సోతుకు సుదర్శన్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. చెన్నూరు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు సొతుకు సుదర్శన్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు మందమర్రిలో గాంధీ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సోతుకు రాజయ్య, ఆలం శంకర్, తాడగోనీ కనకయ్య, మాయ లింగయ్య, కాంపల్లి రాజనర్సు, సాయి కృష్ణ, సంజీవ్, రాజకుమార్, రాఘవ, కొమురయ్య పాల్గొన్నారు

కాసిపేట : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మా గాంధీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ముత్యంపల్లిలో ప్రజాప్రతినిధులు, నాయకులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రొడ్డ లక్ష్మీ, వైస్ ఎంపీపీ పూస్కూరి విక్రంరావు, ఎంపీడీఓ ఎంఎ అలీం పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్ : గాంధీ చూపిన బాటలో నడుస్తూ శాంతి స్థాపనకు కృషి చేయాలని చెన్నూరు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ రాజా రమేష్ అన్నారు. సోమవారం గాంధీ జయంతి పురస్కరించుకుని పట్టణంలోని స్థానిక ఠాగూర్ స్టేడియం ఎదుట గాంధీ విగ్రహానికి డాక్టర్ రాజా రమేష్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు పల్లె రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపతి రాజయ్య, కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ పుల్లూరి లక్ష్మణ్, ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ తేజవత్ రాంబాబు, కాంగ్రెస్ టౌన్ జనరల్ సెక్రెటరీ కొట్టే రాజన్న, బీసీ సెల్ అధ్యక్షుడు మంతు, రవి, ఉప్పుల సురేష్ పాల్గొన్నారు. ఠాగూర్ స్టేడియం ఎదుట గాంధీ విగ్రహానికి మాజీ ప్రభుత్వ విప్, మాజీ ఎమ్మెల్యే, చెన్నూరు కాంగ్రెస్ నాయకులు నల్లాల ఓదెలు పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీబ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపతి రాజయ్య, ఐఎన్‌టీయూసీ నాయకులు తేజావత్ రాంబాబు, బత్తుల వేణు, పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, కొట్టే రాజన్న, నాయకులు మస్కం సంపత్, రోడ్డ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మందమర్రి



జైపూర్

మందమర్రి : మందమర్రి మున్సిపల్ కార్యాలయంలో మహాత్మ గాంధీ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు ఇన్‌ఛార్జి టౌన్ మిషన్ కోఆర్డినేటర్ ఏనుగు రఘురాం, డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ బొల్లు శ్యాంబాబు, పబ్లిక్ హెల్త్ వర్కర్ మేకల నరేష్ పాల్గొన్నారు.

దండేపల్లి : జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను సోమవారం మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో కాంగ్రెస్ ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.

జన్నారం : మండలంలో ప్రభుత్వ ప్రయివేటు కార్యాలయాల్లో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ రామ్మోహన్, పీఆర్టీయూ భవన్‌లో ఆ సంఘం మండల అధ్యక్షుడు కట్ట రాజమౌళి, ఎంఈఓ విజయ్ కుమార్, తిమ్మాపూర్ గ్రామపంచాయతీలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు జాడి గంగాధర్, నేతకాని సంఘ కార్యాలయంలో తెలంగాణ నేతకాని మహర్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్, జన్నారం గ్రామపంచాయతీలో ఉపసర్పంచ్ జంగం రవి, గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జైపూర్ : గాంధీ జయంతి వేడుకలు సోమవారం మండల పరిధిలో ఘనంగా జరుపుకున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గోదారి రమాదేవి లక్ష్మన్, జడ్పీటీసీ మేడి సునిత తిరుపతి, ఎంపీడీఓ సత్యనారాయణతో కలిసి గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ పంచాయతి కార్యాలయాల్లో సర్పంచులు, ఎంపీటీసీ, వార్డు సభ్యులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. కాంగ్రెస్ చెన్నూర్ నియోజకవర్గం అభ్యర్థి డాక్టర్ రాజారమేష్‌తో కలిసి జిల్లా కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్ రెడ్డి, మండల పరిధి కార్యకర్తలు మహత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి సేవలను స్మరించారు.

రెచినిలో జిల్లా స్థాయి కోకో ఎంపిక పోటీలు

నవతెలంగాణ-తాండూర్

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం అండర్-14 బాల బాలికలకు, తాండూర్ మండలంలోని రేచిని హై స్కూల్‌లో జిల్లా స్థాయి కోకో టోర్నమెంట్, సెలక్షన్స్ జరుగుతాయని ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ పరిమళ తెలియజేశారు. రేచిని హై స్కూల్ పీఈటీ పాశం శ్రీనివాస్‌కు ఫోన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. పోటీల్లో పాల్గొనే వాళ్ళు బోనఫైడ్ సర్టిఫికెట్‌తో పాటు ఆధార్ కార్డు తీసుకొని రావాలన్నారు. పోటీల్లో పాల్గొనే బాలబాలికల వివరాలనును పాశం శ్రీనివాస్ సెల్ 7013215594 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. క్రీడాకారులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు రిపోర్ట్ చేయగలని ఆమె కోరారు

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి



నవతెలంగాణ-జన్నారం

జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మండల జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు చిలివేరి నరసయ్య అన్నారు. సోమవారం మండల జర్నలిస్టులు మండలం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీ లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మీడియా రక్షణ చట్టాన్ని అమలు చేయాలన్నారు. మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు, ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు అందించాలన్నారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో జన్నారం మండల జర్నలిస్టులు ఎంబడి మల్లేశం, గాజుల లింగన్న, పూదరి సత్యనారాయణ గుండా పవన్ కుమార్ శీలం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని రెబ్బనపల్లి గ్రామానికి చెందిన బోనగిరి శ్రీనివాస్(42) అనే వ్యక్తి ప్రమాదవశత్తు వ్యవసాయ బావిలో పడి మృతి చెందినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు శ్రీనివాస్ గత కొద్ది కాలంగా మానసిక పరిస్థితి బాగోలేక ఇబ్బంది పడుతూ సోమవారం ఇంటి నుంచి బయటకి వెళ్లిన ఆయన తిరిగిరాలేదు. ఆందోళన గురైన కుటుంబ సభ్యులు శ్రీనివాస్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో శ్రీనివాస్ భార్య వెంటనే కుటుంబ సభ్యులకు తెలియజేసింది. శ్రీనివాస్ ఆచూకి కోసం ఎంత వెతికిన దొరకలేదు. వ్యవసాయ బావిలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడని అటుగా వెళ్లిన రైతులు తెలుపగా కుటుంబ సభ్యులు శ్రీనివాస్ మృతదేహంగ గుర్తించారు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

తెలంగాణను దోచుకుంటున్న కేసీఆర్ కుటుంబం



నవతెలంగాణ-జన్నారం

తెలంగాణను కేసీఆర్ కుటుంబం దోచుకుంటోందని మాజీ ఎంపీ బీజేపీ నాయకులు రాథోడ్ రమేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో వెనకబడి పోయిందని అన్నారు. ములుగులో గిరిజన యూనివర్శిటీ నిజామాబాద్‌లో పసుపు బోర్డును మంజూరు చేసిన ప్రధాని నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరినయక్, మండల అధ్యక్షుడు గోలి చందు జిల్లా నాయకులు ఎంపీటీసీ కొత్తం శంకరయ్య, బద్రి నాయక్, గోపాలరావు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ ముందు



నవతెలంగాణ-దండేపల్లి

సేవ కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ ఎప్పుడు ముందుంటుందని లైన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అనుమండ్ల రాజిరెడ్డి అన్నారు. మండలంలోని మామిడిపల్లి పంచాయతీ పరిధిలోని ఉట్ల గిరిజన గ్రామంలో గిరిజనులకు ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేసి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల లైయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఆయన కొనియాడారు. రానున్న చలికాలం దృష్టిలో ఉంచుకొని గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. మండల వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల లైయన్స్ క్లబ్ అధ్యక్ష ప్రధాన మాదంశెట్టి మల్లికార్జున్, కుంచే కిషన్, కోశాధికారి పాత శ్రీనివాస్, సభ్యులు బూసిరాజు రాజన్న, నారాయణరావు, సుగుణాకర్‌రెడ్డి, రామచందర్, బొలిశెట్టి రాజన్న, లైయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు అన్నం సత్యనారాయణ, జాబు సుగునాకర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల వంటావార్పు



నవతెలంగాణ-జన్నారం

తమ సమస్యలను పరిష్కరించాలని 22 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట వంటావార్పు చేసి నిరసన తెలిపారు. అనంతరం గాంధీ జయంతి సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి గాంధీ చిత్రపటానికి వినతిపత్రం అందించారు. తమ సమస్యలను ప్రభుత్వం త్వరగా పరిష్కరించాలన్నారు. అప్పటివరకు సమ్మెను కొనసాగిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు తోకల సరస్వతి, గంజాయిల జమున, జయ, విజయ, లక్ష్మి నసీమా, స్వరూప పాల్గొన్నారు.

అడవులను, వన్యప్రాణులను కాపాడుకుందాం

నవతెలంగాణ-జన్నారం

అడవులను, వన్యప్రాణులను కాపాడుకుందామని జన్నారం ఎఫ్డీఓ మాధవరావు సూచించారు. 69వ వన్యప్రాణి, పర్యాటక పక్షోత్సవాల సందర్భంగా సోమవారం అటవీశాఖ అధికారులు, సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ నేషనల్, టైగర్ కన్వర్జేషన్ అథారిటీ సూచనల మేరకు గత నెల 15వ తేదీ నుంచి నేటి గాంధీ జయంతి వరకు కవ్వాల్ టైగర్ జోన్‌లోని వివిధ రేంజ్ పరిధిలో స్వచ్ఛత పక్వాడ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఆ కార్యక్రమాలు నేటితో ముగిశాయన్నారు. చెట్లను మనం రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయి అన్నారు. వన్యప్రాణులను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒకరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరికి మంచి భవిష్యత్తు కావాలంటే మొక్కలు నాటి సంరక్షించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ ఆఫీస్ ఉద్దీన్ పాల్గొన్నారు.

సంఘమిత్ర ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో శాఖాహార ర్యాలీ

నవతెలంగాణ-తాండూరు



బెల్లంపల్లి సింగరేణి సంఘమిత్ర పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో అహింసాయాత శాకాహార సద్భావన ర్యాలీ నిర్వహించారు. సోమవారం ధ్యాన కేంద్రం నుండి బజార్ ఏరియా వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా సీనియర్ మాస్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శాఖాహారం తీసుకోని అహింస మార్గంలో జీవించాలన్నారు. శాఖాహారం తీసుకోవడం వల్ల మానసిక ప్రశాంతత, ఏకాగ్రతతో పాటు సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని తెలిపారు. శాఖాహార తీసుకోవడం వల్ల కలిగే లాభాల గురించి వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పిరమిడ్ మాస్టర్ కాసీపేట మల్లేష్, గుండ శంకరయ్య, పందిళ్ళ యాదగిరి, పొట్ల సురేష్, శ్యామల, మనోహర్, దామర సమ్మయ్య, మర్రి చంద్రయ్య పాల్గొన్నారు.

ఘనంగా గాంధీ జయంతి వేడుకలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక గాంధీ చౌక్‌లోని గాంధీ విగ్రహానికి పలు సంఘాలు, రాజకీయ నాయకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. స్థానిక బీసీ బాలుర వసతిగృహంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గాంధీ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లాఉపాధ్యక్షులు సాయికుమార్, సహాయ కార్యదర్శి దిగిడె ప్రకాష్, నాయకులు పాల్గొన్నారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎఎస్ఆర్ మూర్తి, శివప్రసాద్, నర్సయ్య, పురుషోత్తం, తాజొద్దీన్, జి పూర్ణచందర్‌రావు, రాజయ్య నర్సయ్య, మార్త సత్యనారాయణ పాల్గొన్నారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో స్థానిక గాంధీ చౌక్‌లో జయంతి వేడుకలను నిర్వహించారు. గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దాసరి వెంకటేష్, కొంగ సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

వాంకిడి : గాంధీ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రహీమొద్దీన్ గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

సిర్పూర్(టి) : గాంధీ జయంతిని పురస్కరించుకొని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తసీమా పర్వీనా, కోఆప్షన్ సభ్యుడు ఖిజర్ హుస్సేన్, ఈఓ కృష్ణమూర్తి, వార్డుసభ్యులు ఇఫ్బత్ హుస్సేన్, ప్రసాద్, సంతోష్, మోవింద్, గ్రామ కోఆప్షన్ సభ్యుడు ఆసిఫ్ హుస్సేన్ పాల్గొన్నారు.

గాంధీ చౌక్‌లో నిరసనల వెల్లువ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేపడుతున్న అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం గాంధీ చౌక్‌లో తమ నిరసనను వ్యక్తం చేశారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని గాంధీ విగ్రహానికి కార్మికులు వినతిపత్రాలు ఇచ్చారు. ఆశ వర్కర్లు ముందుగా కాగజ్‌నగర్‌లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ చౌక్‌కు వెళ్లి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి వినతిపత్రం అందించారు. అదేవిధంగా అంగన్‌వాడి కార్యకర్తలు కూడా సేవ్ ఐసీడీఎస్ అంటూ నినాదాలు చేసి గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. ఐసీడీఎస్ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పలు కార్యక్రమాలు చేపట్టారు. అదేవిధంగా మధ్యాహ్న భోజన కార్మికులు కూడా గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్‌తో పాటు ఆయా రంగాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



బీసీ బందులో ప్రాధాన్యత కల్పించాలి



నవతెలంగాణ-జన్నారం

బీసీ బందులో కుమ్మరి కులస్తులకు ప్రాధాన్యత కల్పించాలని సోమవారం బీఆర్ఎస్ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్‌ను కుమ్మరి కులస్తులు కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం, ఖానాపూర్ లోని వారి నివాసంలో మండల కుమ్మరుల సంఘం ఆధ్వర్యంలో శాలువా పూలమాలలతో సత్కరించారు. గతంలో ఇచ్చిన బీసీ బందులో కుమ్మరులకు ఒకరికి కూడా మండలంలో బీసీ బందు ఇవ్వలేదన్నారు. కడు పేదరికంతో జీవనం సాగిస్తున్న కుమ్మరులకు బీసీ బందులో ప్రాధాన్యత కల్పించి ఆదుకోవాలని వారు జాన్సన్ నాయక్‌ని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఖానాపూర్ బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ వచ్చే బీసీ బందులో కుమ్మరులకు అధిక ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇచ్చినట్లు మండల కుమ్మరి సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి సంఘం నాయకులు ఉప్పునీటి అంజన్న దుంపటి మురళి కొత్తపల్లి రామన్న కట్లకుంట రాజన్న, ఉప్పునీటి శేఖర్, దుంపటి నరసయ్య, ఏగిడి నరసయ్య, ఎడుగు భూమన్న, కోడూరి సత్తన్న పాల్గొన్నారు.

ర్యాలీని జయప్రదం చేయాలి : ఐద్వా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



మహిళల హక్కుల పరిరక్షణకు ఢిల్లీలో అక్టోబర్ 5న నిర్వహించ తలపెట్టిన ర్యాలీని జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి జమున మహిళలకు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని సుందరయ్య భవనంలో ర్యాలీకి సంబంధించిన కరపత్రాలను సంఘం నాయకురాళ్లతో కలిసి ఆమె ఆవిష్కరించారు. మహిళల హక్కులకు రక్షణ, భరోసా, భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపైనే ప్రధానంగా నినదిస్తూ ర్యాలీ చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు శకుంతల, జిల్లా సహాయ కార్యదర్శి లలిత, జిల్లా కోశాధికారి మంజుల కమిటీ సభ్యులు ఉన్నారు.

కుటుంబ ఆరోగ్యా సర్వే

నవతెలంగాణ-లక్ష్మణచాంద



గ్రామీణ ప్రాంతంలో కుటుంబ ఆరోగ్యంపై జాతీయ స్థాయి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో సర్వే నిర్వహించారు. సిగ్మా రిసెర్చ్ సెంటర్ సభ్యులు మండలంలో ఇంటింటికీ వెళ్లి కుటుంబ నియంత్రణ, మాతశిశుసంరక్షణ, పోషణ, వ్యాధి నిరోధక టీకాల వివరాలతో పాటు తాగునీరు, పారిశుధ్యం తదితర అంశాలపై సర్వే నిర్వహించారు. జిల్లా ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నిర్వహించి నివేదికను ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాపులేషన్ ఆర్గనైజేషన్‌కు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముత్యంరెడ్డి, ఆరోగ్యశాఖ అధికారి శివకృష్ణ, కార్యదర్శి విక్రమ్ రాజ్, వార్డ్ సభ్యులు రవికిరణ్, లక్ష్మి, నారాయణ, రాజేందర్‌రెడ్డి, గంగాధర్, శ్రీనివాస్, సంస్థ ఆర్గనైజేషన్ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడల ద్వారా ఉజ్వల భవిష్యత్తు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

క్రీడల ద్వారా మానసిక, శారీరక ధృడత్వం పెరుగుతుందని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉజ్వల భవితను పొందాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. బీసీ గురుకులాల ఉమ్మడి జిల్లా స్థాయి అండర్ 14, 19 క్రీడా పోటీలను మహాత్మా జ్యోతిబాపూలే కళాశాలలో సోమవారం నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలను చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. తెలంగాణ సాధించిన తర్వాత 327 గురుకులాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు అత్యుత్తమ విద్యను అందిస్తున్నామని చైర్మన్ అన్నారు. విద్యార్థులకు ఆసక్తి కలిగిన క్రీడలలో తగిన ప్రోత్సాహం ఇస్తున్నామని పేర్కొన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ ఉత్తమ ఫలితాలు పొందాలన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై సత్తా చాటాలని సూచించారు. కార్యక్రమంలో గురుకులాల ఆర్సీవో గోపీచంద్, ప్రిన్సిపాల్ విద్య, కౌన్సిలర్ పవన్ నాయక్, రుక్మారెడ్డి, కలీం పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జగిత్యాల జిల్లాలో సెప్టెంబర్ 30, అక్టోబర్ 1, 2 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, క్యాడేట్ కొరిగి, పోంసే విభాగాల్లో వివిధ వెయిట్ కేటగిరిలో జిల్లాకు చెందిన సహా తైక్వాండో క్రీడాకారులు తమ ప్రతిభను చాటారు. ఈ పోటీల్లో పలు జిల్లాల క్రీడాకారులు పాల్గొనగా జిల్లా విద్యార్థులు 14 పథకాలు సాధించారు. ఒక బంగారు, 3 వెండి, 10 కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులలో శ్రీ చైతన్య, ఆర్యభట్ట, చావరా అకాడమీ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రస్థాయి తైక్వాండో అధ్యక్షులు మూట శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కురువ శ్రీహరి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్, జిల్లా తైక్వాండో అధ్యక్షులు, కోచ్ అన్నారపు వీరేష్, ప్రధాన కార్యదర్శి అకోజీవార్ శృతి, జిల్లా ఉపాధ్యక్షులు కన్య మాధవి, కోచ్‌లు వనిత రాథోడ్, శివప్రసాద్, శివకుమార్, తెలంగ్ అజయ్, విజయ్ పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని జిల్లా అదనపు న్యాయమూర్తి శివరాం ప్రసాద్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కోర్టు ప్రాంగణంలో మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి తోటి న్యాయమూర్తులతో పాటు, కోర్టు సిబ్బందితో కలిసి శ్రమదానం చేశారు. చీపుర్లతో పరిసరాలను శుభ్రం చేశారు. పరిసరాల పరిశుభ్రతపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమా దేశ్‌పాండే, మంజుల, సూర్యవార్ తులసి, దుర్గారాణి పాల్గొన్నారు.

గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు పాటుపడాలి



నార్నూర్



బజార్‌హత్నూర్



ఉట్నూర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గాంధీజీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు పాటుపడాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం స్థానిక జిల్లా జైలులో గాంధీ జయంతి సంధర్భంగా నిర్వహించిన ఖైదీల సంక్షేమ దినోత్సవంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్, జిల్లా అదనపు సెషన్ జడ్జి, అధికారులు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యకమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గాంధీజీ జయంతి సందర్భంగా ఖైదీల సంక్షేమ దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని అన్నారు. జైలులో ఖైదీల సంక్షేమం, పరివర్తన చెందడానికి ప్రభుత్వం పలు సంక్షేమ అభివృద్ధి, సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాదని తెలిపారు. ఖైదీలు గతాన్ని మర్చిపోయి సత్ప్రవర్తనతో మెలగాలని, విడుదల అనంతరం కుటుంబానికి సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని ఆకాంక్షించారు. జిల్లా అదనపు సెషన్ జడ్జి డా.పి.శివరాం ప్రసాద్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ అహింస మార్గాన్ని అనుసరించి స్వాతంత్ర్యం తీసుకురావడం జరిగిందని, మహాత్ముడు చూపిన బాటలో ప్రతి ఒక్కరు పయనించాలని అన్నారు. క్షణికావేశంలో నేరస్తులుగా మారడం జరిగిందని, జైలు జీవితం అనంతరం సమాజహితం కోసం మార్పు చెందాలని అన్నారు. న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఖైదీలు ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని తెలిపారు. జిల్లా జైలు పర్యవేక్షకులు అశోక్ కుమార్ మాట్లాడుతూ జైలులో ఖైదీలకు అందిస్తున్న వృత్తి నైపుణ్య శిక్షణలు, వారి సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. అనంతరం ఖైదీల సంక్షేమ దినోత్సవం సంధర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన ఖైదీలకు కలెక్టర్, జడ్జి, అధికారులు బహుమతులను అందజేశారు. అంతకు ముందు జైలు పరిసరాలను కలెక్టర్, జడ్జి పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జడ్జి (పీసీఆర్) దుర్గారాణి, డీఎస్పీ ఉమేందర్, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి క్షమా దేశ్‌పాండే, డీపీఆర్వో ఇ.విష్ణువర్ధన్, న్యాయవాది గంగారాం, జైలు సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో...

మహాత్మా గాంధీ కలలను సాకారం చేసే దిశగా సీఎం కేసీఆర్ సమర్థవంతమైన పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని గాంధీ చౌక్‌లో సోమవారం ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా సంఘం నాయకులతో కలిసి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ మేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యమే దేశ స్వరాజ్యమన్న మహాత్మా గాంధీ ఆశయాల సాధనకు రాష్ట్ర ప్రభుత్వం పాటు పడుతోందని అన్నారు. గాంధీ సూచించిన అహింస మార్గంలో పయనించాలన్నారు. పట్టణ సుందరీకరణలో భాగంగా గాంధీచౌక్ అభివృద్ధి పనులను త్వరలోనే ప్రారంభించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్ఓ రమేష్ రాథోడ్, డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, అశోక్ స్వామి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మెట్టు ప్రహ్లాద్, రామ్‌కుమార్, జంగు పటేల్, కుమ్రా రాజు పాల్గొన్నారు.



ఆదిలాబాద్ టౌన్

టీడీపీ ఆధ్వర్యంలో...

మహాత్మా గాంధీ జయంతిని తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం గాంధీచౌక్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి అల్లూరి రాజారెడ్డి మాట్లాడారు.

అక్రమ అరెస్టును ఖండిస్తూ నిరసన...

అనంతరం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ గాంధీ విగ్రహం ముందర నల్ల వస్త్రం నోటికి కట్టుకొని మౌన దీక్షని చేపట్టారు. జగన్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్తామన్నారు. పట్టణ పార్టీ అధ్యక్షులు ఎండి రఫీక్ నాయకులు సోమ గంగారెడ్డి, జక్కుల సుభాష్, షేక్ అహ్మద్, సురేందర్, పార్లమెంట్ కార్యదర్శి గంగాసరపు ఓమన్న, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పతిహార ప్రభాకర్, ఆకుల రాము మండల నాయకులు ఉన్నారు.

నార్నూర్ : మహనీయులను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ జాదవ్ అన్నారు. సోమవారం గాంధీ జయంతి పురస్కరించుకొని తాడిహత్నూర్ గ్రామపంచాయతీ భవనంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. గ్రామసభ నిర్వహించి గ్రామాభివృద్ధిపై చర్చించారు. గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. అదేవిధంగా మండల కేంద్రంలో నాయకులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని గుంజాల, నాగల్‌కొండ, బేతల్‌గూడ, మరప్పగూడ, బలాన్‌పూర్, మహాగావ్, కొత్తపెల్లి, ఖంపూర్‌తో పాటు మండలంలోని అయ గ్రామపంచాయతీలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు మధుకర్ రాథోడ్, యశ్వంత్ రాథోడ్, కుంర సావిత్రిబాయి, ముక్తా రుపదేవ్, సుజాత పరమేశ్వర్, సునీత జాదవ్, కుంర యాదవ్‌రావ్, సలాం ఆనంద్‌రావ్, ఉపసర్పంచ్ విష్ణు ఫడ్, కార్యదర్శులు, కొల శేఖర్, శ్రీనివాస్, వినోద్, శ్రీనివాస్, రవి కుమార్, దినేష్, అనురాగ్, కాశీరాం ఏఈఓ సాయికృష్ణ ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు కార్యదర్శులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

జైనథ్ : మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఉదయం గాంధీ చిత్రపటానికి ఎంపీపీ మర్శెట్టి గోవర్ధన్ నాయకులు, అధికారులతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దుమాల దేవన్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తుమ్మల వెంకటరెడ్డి, ఎంపీటీసీ సుదర్శన్, పులివేణి గణేష్, ఎంపీడీఓ గజానన్, కార్యదర్శి ముజీబ్‌ఖాన్ పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్ : గాంధీ చూపిన బాటలో నేటి యువత నడుచుకోవాలని ఉపసర్పంచ్ చట్ల విలాస్ తెలిపారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో స్వచ్ఛత కార్యక్రమాన్ని యువ చైతన్య యువజన సంఘ సభ్యులతో కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పర్చ సాయన్న పాల్గొన్నారు. ముందుగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వతంత్ర ఉద్యమంలో గాంధీ చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ శాంతి మార్గంలో ప్రతి సమస్యను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. యువ చైతన్య యువజన సంఘం సభ్యులు చేస్తున్న కార్యక్రమాలను అభినందిస్తూ కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రాములు, గజ్జరాం, సీనియర్ యూత్ సభ్యులు లక్ష్మణ్, సంతోష్, రాజేశ్వర్, నరేందర్, మహేష్, నరేష్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : మన జాతి పిత మహాత్మా గాంధీ 154వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ పార్టీ కార్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళ్లు అర్పించారు.

ఉట్నూర్ : గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రజా ప్రతినిధులు, అధికారులు సూచించారు. గాంధీ జయంతి వేడుకలను సోమవారం మండలంలోని ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. ఘన్‌పూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ పంద్ర లత, ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు నివాళులర్పించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలలు, పాఠశాలల, కార్యాలయాల్లో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఐటీడీఏ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమాల్లో అధికారులు, నాయకులు, తదితరులు ఉన్నారు.



ఆదిలాబాద్ టౌన్ టీడీపీ ఆధ్వర్యంలో...



ఆదిలాబాద్ టౌన్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో...



ఇంద్రవెల్లి

జాతిపిత మహాత్మా గాంధీ జీవనం ప్రజలకు ఆదర్శనీయం



నిర్మల్

నవతెలంగాణ-నిర్మల్

జాతిపిత మహాత్మాగాంధీ జీవనం ప్రజలకు ఆదర్శనీయమని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. సోమవారం గాంధీ జయంతి పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కులో గాంధీ విగ్రహానికి, కలెక్టరేట్‌లో ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డితో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. స్వాతంత్ర్య సమరంలో మహాత్మా పాత్ర ఎనలేనిదని కీర్తించారు. సత్యం, అహింసలే ఆయుధాలుగా గాంధీ భారత స్వరాజ్య సంగ్రామ చరిత్రలో నూతన అధ్యాయానికి నాంది పలికారని అన్నారు. బాపు చూపిన మార్గాన్ని అనుసరిస్తూ ముందుకెళ్లాలని సూచించారు. సీఎం కేసీఆర్ కృషితో ప్రస్తుతం ఉన్న గాంధీ పార్క్ అభివృద్ధి కొరకు నిధులు వెచ్చించి సుందరంగా తీర్చిదిద్దుతామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్ : మండలంలో గాంధీ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ వీరేష్ కుమార్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించి, గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. న్యూలోలం గ్రామంలో సర్పంచ్ ఒడ్నం సవిత కృష్ణ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. న్యూలోలం గ్రామంలో గ్రామ సభ నిర్వహించి, పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి తీర్మానం చేశారు. కలెక్టర్ నిధులతో గ్రామంలో అంగన్వాడీ కేంద్రం-2 పనుల గురించి ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గాంధీజీ దేశ స్వాతంత్ర్యం కోసం ఎనలేని కృషి చేసి, అహింసాయుత పోరాటంతో స్వాతంత్ర్యం సాధించిన గొప్ప మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్, ఎంపీపీ పాల్దె అక్షర అనిల్, పంచాయతీ సెక్రటరీ చంద్రశేఖర్, వార్డు సభ్యులు ఉద్గిరి సాయి, ఇషాక్, శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యుడు ముత్యంరెడ్డి, బోజరామ్ పటేల్ పాల్గొన్నారు.

కుభీర్ : గాంధీ అడుగుజాడల్లో యువకులు ప్రతి ఒక్కరూ నడువాలని సర్పంచ్ మీరా విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని ఆయా గ్రామాల్లో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఉన్న గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మోహియోద్దీన్ నగేష్, వివేకానంద, హనుమల్లు, సంతోష్, అనిల్, మండల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద : మండల కేంద్రంలో సోమవారం గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్ ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలు స్మరించుకున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గాంధీ విగ్రహలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బాసర : తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె చేపడుతున్న అంగన్‌వాడీలు సమ్మె శిబిరంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతిపిత మార్గంలోనే శాంతియుతంగా నిరసన తెలుపుతున్నామని, 22 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేధన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, అరుణ, అర్చన, సరోజ, రజియా, సాయవ్వ పాల్గొన్నారు.

బాసర : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో సోమవారం గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ లక్ష్మణరావు,కిర్గుల్ (బి) గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీజీ చిత్రపటానికి సర్పంచ్ సుధాకర్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయాలలో గ్రామ సభలు నిర్వహించార. గాంధీజీ కలలుగన్న స్వరాజ్యం రావాలంటే పల్లెల్లో అభివద్ధి జరగాలని ఆకాంక్షించారని మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా సర్పంచులు స్వచ్ఛభారత్ లో భాగంగా పలు కాలనీలలో చీపుర్లు పట్టి పరిసరాలను శుభ్రపరిచారు . కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గోవిందరాజు, వాడు సభ్యులు సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.



లక్ష్మణచాంద



బాసర

జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టాలను తీసుకురావాలి

నవతెలంగాణ-కడెం

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు కేటాయించి జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలని టీయూడబ్ల్యూజే, ఐజేయూ జిల్లా ఉపాధ్యక్షులు తక్కల రవీందర్ కోరారు. సోమవారం కడెం మండల జర్నలిస్టులతో కలిసి తహసీల్దార్ రాజేశ్వర్‌కి వినతిపత్రాన్ని అందజేసి, స్థానిక గాంధీ విగ్రహం వద్ద జర్నలిస్టులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టాలను తీసుకురావాలని అక్రిడేటేషన్ కలిగిన అందరికీ రైల్వే పాసులను పునరుద్ధరించాలని అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు కేటాయించి, ఇండ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు రాచకొండ రవీందర్ ఆంటోనీ ధనరాజ్, బొమ్మ దశగౌడ్, రాపర్తి వెంకటేష్, అల్లాడి రంజిత్ కుమార్, దమ్మల విజయ్ కుమార్, మండల జర్నలిస్టులు పాల్గొన్నారు.

నిషేధ మత్తు పదార్థాలపై నిఘా ఉంచాలి



నవతెలంగాణ-తాంసి

నిషేధిత మత్తు పదార్థాలు గంజాయి, దేశదారు వంటి వాటిపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టాలని అదిలాబాద్ డీఎస్పీ ఉమేందర్ అన్నారు. సోమవారం తాంసి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి కేసులకు సంబంధించిన రికార్డుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా స్టేషన్ ఆవరణలో సీఐ సైదారావ్, ఎస్సై శివరాంతో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిషేధిత మత్తు పదార్థాలు మండలంలో రాకుండా నిఘా పెంచాలన్నారు. యువత వాటికి బానిస కాకుండా చూడాలన్నారు. ప్రతిరోజు మారుమూల గిరిజన గ్రామాలల్లో రాత్రి సమయాల్లో గస్తీ నిర్వహించాలన్నారు. మహారాష్ట్ర చుట్టు పక్కల గ్రామాల్లో మట్కా కొనసాగుతున్నట్టు దృష్టికి వచ్చిందని అలాంటి వ్యక్తిలను గుర్తించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా గ్రామ సర్పంచ్‌లకు అవగాహన కల్పించాలన్నారు.